సాక్షి
మెదక్
బుధవారం । 7 । జూన్ । 2023



చినుకు లేకున్నా విత్తుతున్నారు
చినుకు లేకున్నా.. రైతులు పత్తి సాగుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే చాలా చోట్ల విత్తనాలు విత్తుతున్నారు. చినుకు లేకుండా విత్తుకోవడం సరికాదని వ్యవసాయశాఖ హెచ్చరిస్తోంది. 8లో



సంగాయిపేటతో తాగునీటి కష్టాలు
కొల్చారం మండలంలోని సంగాయిపేట తండా గిరిజనులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. రోజుల తరబడి సమస్యను ఎదుర్కొంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. 9లో



అధికారులు వేధిస్తున్నారు
శివ్వంపేట మండలంలోని హరిదాస్ తండాకు చెందిన గిరిజనులు అటవీ అధికారులు వేధిస్తున్నారని వాపోయారు. తాము అటవీ భూమి చదును చేయలేదన్నారు. 8లో

న్యూస్‌రీల్

ప్రభుత్వ బడులు పరిపూర్ణ వికాస కేంద్రాలు



విద్యార్థులను బడిలో చేర్పిస్తున్న డీఈఓ రాధాకిషన్

పాపన్నపేట(మెదక్): ప్రభుత్వ బడులు పరిపూర్ణ వికాస కేంద్రాలని డీఈఓ రాధాకిషన్ అన్నారు. మంగళవారం బడిబాటలో భాగంగా మండల పరిధిలోని యూసుఫ్‌పేట, పాపన్నపేట గ్రామాల్లో ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులను సర్కార్ బడిలో చేర్పించారు. కరపత్రాలను పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా నాణ్యమైన విద్య అందించడానికి నిపుణులైన టీచర్లు ఉన్నారన్నారు. బడి బయట పిల్లలంతా బడిలో చేరాలని కోరారు. ఆయన వెంట ఎంఈఓ నీలకంఠం, సెక్టోరియల్ అధికారి సుదర్శనమూర్తి, ఎంపీడీఓ జగదీశ్వరచారి, నోడల్ అధికారి అంజాగౌడ్, హెచ్‌ఎంలు హరిసింగ్, నాగరాజు, సునంద, రాజశేఖర్, ఫసియొద్దీన్, సంగీత, సీఆర్పీలు మహేశ్వరి, సత్యనారాయణరెడ్డి, దేవయ్య ఉన్నారు.

ప్లాస్టిక్ వాడొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న చంద్రశేఖర్

మెదక్‌జోన్: ప్లాస్టిక్ వాడకంతో పాటు దానిని నిరోధించటంలో ప్రభుత్వం విఫలమైందని స్టూడెంట్స్ ఫర్ డెవలప్‌మెంట్(ఎస్‌ఎఫ్‌డీ) రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఐటీఐ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రోజుకు 12 టన్నుల ప్లాస్టిక్ భూమిలో కలిసి పర్యావరణం దెబ్బతింటుందన్నారు. ప్లాస్టిక్ నిరోధించడంతో అందరూ భాగస్వాములం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాకన్వీనర్ ఉదయ్, శశికాంత్, మనోజ్ కుమార్, దినేష్, హరీష్, శిల్ప, రూప తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ రాజు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి చాకరిమెట్లలో కొలువైన శ్రీ సహకార ఆంజనేయ స్వామిని ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు దర్శించుకున్నారు. ఎమ్మెల్సీ కుటుంబ సమేతంగా మంగళవారం ఆలయానికి రాగా, ఫౌండర్ చైర్మన్ ఆంజనేయశర్మ ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం సత్యనారాయణస్వామి, సీతారామచంద్రస్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయం అందజేస్తానని ఎమ్మెల్సీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ సార శ్రీనివాస్, ప్రధాన అర్చకులు దేవదత్తశర్మ, ప్రభుశర్మ పాల్గొన్నారు.

దశాబ్ది పేరిట పాలనను గాలికొదిలిన సీఎం



శశిధర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): దశాబ్ది ఉత్సవాల పేరిట సీఎం కేసీఆర్ పాలనను గాలికొదిలేశాడని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం రామాయంపేట వచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాధనంతో ప్రచారం చేసుకుంటున్న కేసీఆర్ సమస్యల పరిష్కార విషయమై ఏ పట్టించుకోవడంలేదన్నారు. ఉత్సవాల పేరిట కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి రద్దుచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ధరణి రైతుల పాలిట శాపంగా తయారైందన్నాచారు. ధాన్యం తూకంవేసి నెలరోజులు గడుస్తున్నా ఇంతవరకు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కాలేదన్నారు.

జలకళ.. సాగుభళా

- కాళేశ్వరం కాల్వల ద్వారా హల్దీవాగు, మంజీరాకు నీరు
- ఏటేటా పెరుగుతున్న ఆయకట్టు విస్తీర్ణం

మెదక్‌జోన్: జిల్లాలో ఎలాంటి సాగునీటి ప్రాజెక్టులు లేకపోయినా సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. నిండువేసవిలోనూ చెరువులు, వాగులు జలకళ సంతరించుకొని మత్తళ్లు దూకుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు కాల్వల ద్వారా ప్రస్తుతం 60 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. కాల్వల నిర్మాణం పూర్తయితే 1.94 లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వొచ్చు. కాళేశ్వరం కాల్వల ద్వారా నీరు హల్దీవాగు, మంజీరానదిలో నీటిని విడుదల చేయడంతో భూగర్భజలాలు వృద్ధి చెందాయి.

ముమ్మరంగా కాల్వల పనులు..

- జిల్లా పరిధిలో కాళేశ్వరం ప్రాజెక్టు కాల్వల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ యాసంగి సీజన్‌లో రామాయంపేట, నిజాంపేట, చిన్నశంకరంపేట మండలాల పరిధిలోని కొన్ని చెరువులకు మాత్రమే నీటిని అందించారు.


చెక్‌డ్యాంలకు రూ.119.15 కోట్లు

- జిల్లాలో మంజీరనది ప్రవాహం 70 కిలోమీటర్ల మేర, హల్దీవాగు ప్రవాహం 40 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. వీటి పరిధిలో ఆరు మండలాలు ఉండగా, ఏటా 50 వేల ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు అందుతోంది.
- హల్దీవాగు, మంజీరా నదిపై రూ. 119.15 కోట్లు ఖర్చు చేసి 15 చెక్‌డ్యామ్‌లు నిర్మించారు. మూడు చెక్‌డ్యామ్‌లు మెదక్ నియోజకవర్గ పరిధిలో ఉండగా, నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలో 10 చెక్‌డ్యాములు, మరో 2 చెక్‌డ్యాములు గజ్వేల్ నియోజకవర్గంలోని తూప్రాన్ పరిధిలో ఉన్నాయి.

ఘనాపూర్ ప్రాజెక్టు



- జిల్లాలో ఘనాపూర్ ఒక్కటే ఏకైక మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టు. దీని ఆయకట్టు సాగు విస్తీర్ణం 21,625 ఎకరాలు కాగా, గతంలో ఎప్పుడు పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగు నీరు అందిన దాఖలాలు లేవు.
- సింగూరు ప్రాజెక్టు నుంచి ఘనాపూర్ ప్రాజెక్టులోకి నీటిని వదిలేవారు. గతంలో హైదరాబాద్ తాగునీటి అవసరాలకు పోగా మిగిలిన నీటిని మాత్రమే వదిలే పరిస్థితి ఉన్న కారణంగా రైతులు ఎప్పుడూ సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ధర్నాలు, రాస్తారోకోలు చేసేవారు.
- రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఘనాపూర్ ప్రాజెక్టు ఎత్తు పెంచితే నీటి నిల్వసామర్థ్యం పెరుగుతుందని, చివరి ఆయకట్టుకు నీటి అందించిన వచ్చని ప్రభుత్వం రూ.43.64 కోట్లు మంజూరు చేసింది.
- ఈ ప్రాజెక్టు పరిధిలోని మహబూబ్‌నహర్, ఫతేనహర్ కాల్వలు ఉండగా, నాలుగు మండలాలకు నీరు పారుతోంది. వీటి మరమ్మతుకు రూ. 97.90 కోట్లు మంజూరయ్యాయి. కాల్వల మర్మమతులతో పాటు, సిమెంట్ లైనింగ్ కూడా పూర్తి చేశారు. దీంతో స్థిరీకరించిన ఆయకట్టు 21,625 ఎకరాలతోపాటు మరో 5 వేల ఎకరాలకు అదనంగా సాగునీరు అందుతోంది.



కాళేశ్వరం నీటితో పరవళ్లు తొక్కుతున్న హల్దీవాగు (ఫైల్)

పలు ప్యాకేజీల ద్వారా జరుగుతున్న కాల్వల పనులు పురోగతిలో ఉన్నాయి.

- చిన్నశంకరంపే బ్రాంచ్ కెనాల్‌లో పరిధిలో రూ.159.28 కోట్లతో 76 చెరువులు, కుంటలను అనుసంధానించే పనులు సాగుతున్నాయి. ఇవి పూర్తయితే 19,425 ఎకరాలకు సాగు నీరందుతుంది.
- కాళేశ్వరం ప్రాజెక్టు-19లో భాగంగా రూ 762.47 కోట్లతో పనులు చేస్తున్నారు. ఇవి పూర్తయితే 78 వేల ఎకరాలకు నీరందుతుంది.
- ప్యాకేజీ-18లో రూ.758.07 కోట్లతో పనులు జరుగుతుండగా, 15వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది.
- - ప్యాకేజీ- 13, 14, 22లో భాగంగా పెద్దశంకరంపేట, కిష్టాపూర్, రామాయంపేట, నిజాంపేట మండలాల ఆయకట్టు భూములకు సస్యశ్యామలం అవుతున్నాయి. అన్ని ప్యాకేజీలను కలుపుకొని జిల్లాలో 1.94 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనేది లక్ష్యం.

ధాన్యం దిగుబడి పెంపు

- సాగునీటి వసతి మెరుగపడని 2016-2017 వరకు జిల్లాలో ధాన్యం దిగుబడి తక్కువగా ఉండేది.ఆ ఏడాది వరకు జిల్లాలో 72 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి మాత్రమే వచ్చింది. 2022-2023 వానాకాలంలో 3.93 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. ఈ యాసంగిలో ఏకంగా 5 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. కానీ తెగుళ్లు, అకాల, వడగండ్ల వర్షం కారణంగా పంట దిగుబడి తగ్గిపోయింది.

మిషన్ కాకతీయ

- జిల్లాలో మిషన్ కాకతీయ పథకం ద్వారా నాలుగు విడతల్లో చెరువులు, కుంటలతోపాటు కట్టుకాల్వల మరమ్మతులు ఇలా మొత్తం కలిపి 1870 పనులు చేశారు. ఇందుకోసం రూ. 445.07 కోట్లు ఖర్చు చేశారు. ఫలితంగా సాగునీటి నిల్వ సామర్థ్యం పెరిగింది.

సాగునీటి దినోత్సవాన్ని విజయవంతం చేయండి



రాష్ట్రం వచ్చాక జిల్లాలో సాగునీటి తిప్పలు తప్పాయి. కాళేశ్వరం ప్రాజెక్టు కాల్వల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అవి పూర్తయితే సాగునీటికి ఏ ఇబ్బందులు ఉండవు. ఇప్పటికే హల్దీ, మంజీరా నదులలో కాళేశ్వరం నీటిని నింపటంతో 50 వేల ఎకరాలకు పైగా ఏడాదికి రెండు పంటలు పండుతున్నాయి.

– శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఈఈ

హైవే పొడవునా మొక్కలు నాటాలి



మొక్కలు నాటాలని మున్సిపల్ అధికారులను ఆదేశిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

తూప్రాన్: జాతీయరహదారి(44)కి ఇరువైపులా మొక్కలు నాటాలని కలెక్టర్ రాజర్షిషా మున్సిపల్ కమిషనర్ మోహన్‌ను మంగళవారం ఆదేశించారు. ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో 19న హరిత దినోత్సవం నిర్వహిస్తుందని, ఈ క్రమంలోనే జాతీయ రహదారిపై మొక్కలు లేని ప్రదేశంలో విరివిగా మొక్కలు నాటాలన్నారు. పట్టణాలు, గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించండి

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రమైన మూసాయిపేట శివారులో, 44వ జాతీయ రహదారి పక్కన నాటిన మొక్కలను కలెక్టర్ రాజర్షిషా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి పరిశీలించారు. మొక్కలు ధ్వంసం కావడం, ట్రీ గార్డులు కూడా దెబ్బతిని ఉండడంతో వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎండిన మొక్కల స్థానంలో వేరే మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంపీఓ విఘ్నేశ్వర్‌కు సూచించారు.

రేపు ఊరూరా చెరువుల పండగ

అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలి



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: ఊరూరా చెరువుల పండగను అధికారులంతా సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం ఎస్పీ, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు,ఎంపీఓలు, ఏపీఓలు, మండల కోఆర్డినేటర్లు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 8వ తేదీన ఊరూరా చెరువుల పండగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పంచాయతీలలో నిర్దేశించిన పెద్ద చెరువు వద్ద సాయంత్రం చెరువుల పండవగా ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమాల నిర్వహణకు ఎంపీడీఓలకు నిధులు మంజూరు చేశామని, ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. చెరువు పరిసర ప్రాంతాలలో ముళ్ల పొదలు తొలగించి, నడిచేందుకు వీలుగా ఆ ప్రాంతాన్ని చదును చేయాలన్నారు. లైటింగ్, సౌండ్, మ్యూజిక్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. ఎటువంటి ప్రమాదాలు సంభవించకుండా చిన్న చెరువుల వద్ద ఇద్దరు గజ ఈతగాళ్లు, పెద్ద చెరువుల వద్ద నలుగురు ఈతగాళ్లు పెట్టాలని, అవసరమైతే వలంటీర్లను ఏర్పాటు చేయాలని మత్స్య శాఖ సహాయ సంచాలకులు సూచించారు. గ్రామం నుంచి డప్పులు, బోనాలు, బతుకమ్మలు, మత్స్యకారులు వలలతో ఊరేగింపుగా బయలుదేరేలా చూడాలన్నారు. ఆలయాలను తోరణాలతో అలంకరించాలని, కట్టమైసమ్మ పూజ, చెరువుకు పూజలు చేయాలన్నారు.

నేడు సాగునీటి దినోత్సవం

దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం సాగునీటి దినోత్సవం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ మండలంలోని ర్యాలమడుగు చెక్ డ్యామ్ వద్ద, చిలిప్‌చెడ్ మండలం అజ్జమర్రి చెక్ డ్యామ్ వద్ద సాగు నీటి దినోత్సవ ఉత్సవాలను ఉంటాయన్నారు.

ఉత్తమ సేవలకు అవార్డులు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రమేశ్

మెదక్ కలెక్టరేట్: మీ సేవారంగంలో అత్యధిక లావాదేవీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరచిన ఎనిమిది మందికి అదనపు కలెక్టర్ రమేశ్ అవార్డులు అందజేశారు. మంగళవారం మెదక్ కలెక్టరేట్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు. ఐటీ రంగంలో వివిధ అంశాలలో ఉత్తమ ప్రతిభ కనబరచిన 8 మందిని రాష్ట్ర ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ కార్యాలయం ఎంపిక చేసి జాబితా పంపిందన్నారు. అవార్డులు అందుకున్న వారిలో సుమలత, నరేష్, రాజు(మెదక్), సాయిబాబు(చేగుంట), రంజిత్ కుమార్, రాధిక(చిన్న శంకరంపేట) , విజయ్‌కుమార్(నర్సాపూర్) లతో పాటు టీఎస్టీఎస్‌ఎస్ జిల్లా మేనేజర్ శశికాంత్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజి రెడ్డి, కలెక్టరేట్ ఏఓ హరిదీప్ సింగ్, వీఎల్‌ఈలు ఉన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌పై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లాజడ్జి పి.లక్ష్మీశారద

మెదక్‌జోన్: మెదక్‌లోని జిల్లా న్యాయస్థానాల సముదాయంలో మంగళవారం కోఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీశారద హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 10న జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహిస్తున్నటట్టు చెప్పారు. ఈ లోక్‌అదాలత్‌లో ఎక్కువ మొత్తంలో కేసులను రాజీ చేయాలని పోలీసులకు సూచించారు. ప్రజలు, కక్షిదారులు ఈ సదావకాశాన్ని ఉపయోగించుకుని వారి కేసులను రాజీ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని, సీనియర్ సివిల్ జడ్జ్ సీహెచ్ జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి




నర్సాపూర్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై మాట్లాడుతున్న జడ్జి అనిత

నర్సాపూర్: ఈనెల 10వ తేదీన జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జడ్జి కె.అనిత అన్నారు. మంగళవారం ఆమె కోర్టు హాలులో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, మండల లీగల్ సర్వీస్ కమిటీల ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై పలు శాఖల అధికారులు, న్యాయవాదులతో సమీక్షించారు. ఆయా కేసుల్లో కక్షిదారులు పంతాలకు వెళ్లకుండా తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా రాజీ కుదుర్చుకోవాలన్నారు. కేసులు పరిష్కారం చేసుకునే దిశగా ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆమె ఆయా శాఖల అధికారులకు సూచించారు. సమీక్ష సమావేశంలో ఏజీపీ సత్యనారాయణ, సీఐ షేక్ లాల్ మదార్, ఎస్‌ఐలు శివకుమార్, శివప్రసాద్ రెడ్డి, రవికాంతారావు, గౌసో ద్దిన్, న్యాయవాదులు ఎండి.జాఫర్, స్వరూపరాణి, మధుశ్రీ, ప్రకాష్, ఆనంద్‌కుమార్, ప్రభు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తడిసిన బియ్యం బస్తాలు

- గోదాం నిర్వాహకుల నిర్లక్ష్యమంటున్న శ్రీధర్‌గుప్తా
- అనుమతులే తీసుకోలేదంటున్న మేనేజర్

కొడిపల్లి(నర్సాపూర్): గోదాంలో నిల్వ చేసిన బియ్య బస్తాలు కిందపడి ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసిపోయాయి. అయితే గోదాం నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందని యజమాని అంటుండగా, తమేకేమీ సంబంధం లేదని మేనేజర్ అంటున్నారు. గోదాం నిర్వహణలోపంతో బియ్యం తడిసిపోయాయని, తనకు నష్టపరిహారం చెల్లించా లని శ్రీపాద రైస్ ఇండస్ట్రీ యాజమాని, బీఆర్‌ఎస్ నేత పైడి శ్రీధర్‌గుప్తా డిమాండ్ చేశారు. మంగళవారం కొడిపల్లి మండలం తునికిలోని గాయత్రి గోదాంలో నిల్వ చేసిన తన బియ్య బస్తాలను పరిశీలించారు. బస్తాలను వరండాలో వేశారని, అవి కిందపడడంతో ఇటీవల కురిసన అకాలవర్షానికి తడిసి చెడిపోయాయన్నారు. దీంతో సుమారు రూ. 2కోట్ల నష్టం జరిగిందన్నారు. జిల్లా అధికారులు ఆదేశాలతో తునికి గోదాంలో మూడు నెలల క్రితం 5,500 మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వ చేశానని, ఒక్కోలారీకి రూ 9,600 టోకెన్ చెల్లించానని చెప్పారు. గోదాం నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగానే బియ్యం చెడిపోయాయని ఈ విషయమై డీఎస్‌ఓ,కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మంత్రి హరీశ్‌రావుకు ఫిర్యాదు చేస్తానన్నారు.



తునికిలోని గాయత్రి గోదాంలో కిందపడి తడిసిన బియ్యం బస్తాలు

గోదాం మేనేజర్ వివరణ

ఈ విషయమై గోదాం మేనేజర్ ఉపేందర్‌రావును వివరణ కోసం గాయత్రి గోదాంలో డీఎస్‌ఓతో పాటు జిల్లాలోని ఏ అధికాని నుంచి అనుమతులు తీసుకోకుండా వరండాలో బియ్యం నిల్వ చేశారన్నారు. మూడు నెలలుగా ఇక్కడి నుంచి బియ్యం తీసుకెళ్లాలని నోటీసులు ఇచ్చినా స్పందించలేదన్నారు. వర్షంలో బియ్యం తడవడంపై తమకు సంబంధం లేదన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం

- టీఎస్ ఐపాస్‌తో అన్నీ త్వరగా
- పారిశ్రామిక ప్రగతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



సనోఫి పరిశ్రమలో మాట్లాడుతున్న నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి. చిత్రంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి, కలెక్టర్ రాజర్షిషా, వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు

మనోహరాబాద్(తూప్రాన్): తెలంగాణ వచ్చాక టీఎస్ ఐపాస్ ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల వాతావరణం ఏర్పడిందని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం మండలపరిధిలోని ముప్పిరెడ్డిపల్లి పరిశ్రమలవాడలోని సనోఫీ హెల్త్ కేర్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పారిశ్రామిక ప్రగతి ఉత్సవాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీఎం కేసీఆర్ మెదడు కంప్యూటర్ లాంటిదని, ఎప్పుడు రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి పర్చాలో ఆలోచిస్తూ నిర్ణయాలు తీసుకుని కట్టుబడి ఉంటాడన్నారు. ఆయన పాలసీలను కేటీఆర్ విదేశీ సంస్థలతో మాట్లాడి నమ్మకం కలిగించి తెలంగాణలో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నారు. సీఎం నర్సాపూర్ నియోజకవర్గంపై దృష్టి పెట్టాలని, మాసాయిపేటలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన స్థలాలు ఉన్నాయన్నారు. పరిశ్రమల వల్ల నియోజకవర్గ యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ పరిశ్రమలలో ఉపాధి కోసం సాంకేతిక విద్య అవసరమన్నారు. ఐటీ రంగంలో ముందు ఉన్నామని, దీని కోసం మంత్రి కేటీఆర్ ఎనలేని కృషి చేశారన్నారు. కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ దేశ ఆర్థిక ప్రగతికి పునాది వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగం అన్నారు. ప్రభుత్వం ఓ చక్కటి విజన్‌తో పరిశ్రమల అభివృద్ధికి పాటుపడుతుందన్నారు. టీఎస్ పాస్ ద్వారా రూ.8521 కోట్ల పెట్టుబడితో 790 యూనిట్లు నెలకొల్పి 26,354 మందికి ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. టీప్రైడ్ కింద 1,632 మంది ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.69.29 కోట్ల ఆర్థిక సాయం అందించామన్నారు. ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర భవన, అసంఘటిత కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ ఉమ్మన్నగారి దేవేందర్‌రెడ్డిలు మాట్లాడుతూ పరిశ్రమలు పరుగులు పెడుతున్నాయని, ఫుడ్ ప్రాసెస్ యూనిట్ల ఏర్పాటుకు అనువుగా ఉందన్నారు. అనంతరం పరిశ్రమ వద్ద ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించారు. ఉత్తమ పారిశ్రామికవేత్తలను శాలువాతో సన్మానించి, మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, రమేష్, గడా ప్రత్యేక అధికారి ముత్యంరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రంగౌడ్, ఆర్డీఓ శ్యాంప్రకాష్, ఏడీ మైన్స్ జయరాజ్, డీఆర్డీఓ శ్రీనివాస్, ఎంపీపీ పురం నవనీతరవి, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ నరాల ప్రభావతిపెంటన్న, ఆత్మకమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మందుబాబులకు జరిమానా, జైలు

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా, వీరిలో ఒకరికి జైలు శిక్ష విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, మెదక్ రోడ్డు, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తా, వేములవాడ కమాన్ వద్ద తమ సిబ్బందితో కలిసి వారంరోజుల క్రితం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో 10 మంది వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో మంగళవారం హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి 10 మంది వాహనదారులకు రూ.23 వేల జరిమానా, వీరిలో ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పది మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఎనిమిది మందికి ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున, ఒకరికి రూ.3 వేలు, మరో వ్యక్తికి రూ.5 వేల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని యాచకురాలి మృతి



కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాలలో గుర్తు తెలియని యాచకురాలు మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ చంద్ర మోహన్ యాదవ్ వివరాల ప్రకారం.. ఆలయ పరిసరాలలో యాచకురాలైన గుర్తుతెలియని మహిళ(65) మృతి చెంది ఉన్నట్లు పంచాయతీ కార్యదర్శి లోకేశ్ పోలీసులకు తెలిపాడు. మృతదేహాన్ని చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలి ఆచూకీ తెలిసినవారు కొమురవెల్లి పోలీసులను సంప్రదించాలన్నారు.

మహిళ అదృశ్యం



లక్ష్మి (ఫైల్)

సంగారెడ్డి టౌన్: ఓ మహిళ అదృశ్యమైంది. సంగారెడ్డి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పుల్కల్ మండలం ముది మాణిక్యం గ్రామానికి చెందిన కూరకు లక్ష్మి(52) సోమవారం ఉదయం డయాలసిస్ పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి వెళ్లింది. అక్కడినుంచి పోతిరెడ్డిపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లింది. అక్కడ ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన బంధువులు చుట్టుపక్కల, తెలిసిన వారి ఇంట్లో ఆచూకీ కోసం వెతికారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు..



రాజు(ఫైల్)

మెదక్ మున్సిపాలిటీ: చేపల వేటకు వెళ్లి నీట మునిగి ఓ మత్స్యకారుడు మృతి చెందాడు. పోలీసులు, మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లంబేస్‌కు చెందిన గోదల రాజు(25) మంగళవారం ఉదయం పిట్లంచెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చెరువులో చేపలు పడుతుండగా చెరువులోని వలలో చిక్కుకొని మృత్యువాత పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రాజు మృతదేహాన్ని చెరువులోంచి బయటకు తీయించారు. పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ వెంకటేశ్ తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల తనిఖీలు!

దుబ్బాకరూరల్: మండలంలోని అచ్చుమాయిపల్లి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తు న్న వ్యక్తి ఇంట్లో ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించినట్లు తెలిసింది. ట్రావెల్ బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్న గ్రామానికి చెందిన వ్యక్తి మహారాష్ట్ర నుంచి అక్రమంగా మద్యం తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ విషయంపై పలువురు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో తనిఖీలు నిర్వహించినట్లు తెలిసింది.

చినుకు లేకున్నా విత్తుతున్నారు

- మొదలైన పత్తి సాగు
- తేమ లేకుండా విత్తు వద్దంటున్న అధికారులు



గజ్వేల్ మండలం రిమ్మనగూడలో పత్తి విత్తనాలు విత్తుతున్న దృశ్యం

గజ్వేల్: చినుకు లేకున్నా.. రైతులు పత్తి సాగుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే చాలా చోట్ల విత్తనాలు విత్తుతున్నారు. రైతులు చినుకు లేకుండా విత్తుకోవడం సరి కాదని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

- వానాకాలం సీజన్‌కు సంబంధించి సిద్దిపేట జిల్లాలో 5.78లక్షల ఎకరాల్లో పంటలు సాగులోకి వస్తాయని అధికారుల అంచనా.
- 4లక్షల ఎకరాల్లో వరి, 36వేల ఎకరాల మొక్కజొన్న, 12,500ఎకరాల్లో కంది, 14వేల ఎకరాల్లో పెసరు, 1.30లక్షల ఎకరాల్లో పత్తి సాగులోకి రానుంది.
- జిల్లాలో చాలా చోట్ల చినుకు పడకముందే రైతులు పత్తి విత్తనాలు విత్తుతున్నారు.
- చినుకులు పడ్డాకే విత్తనాలు వేసుకోవాలని, నేలలో తేమ లేకుండా విత్తనం వేయొద్దని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.
- జూన్ 1 తర్వాత నుంచి విత్తన ప్యాకెట్ల అమ్మకాలకు అనుమతి ఇవ్వడంతో ఇప్పటికే 60 శాతానికిపైగా విక్రయాలు జరిగినట్లు తెలుస్తోంది.
- జిల్లా వ్యాప్తంగా సుమారుగా 5లక్షల విత్తన ప్యాకెట్లకు పైగా అవసరముంటాయి.
- పత్తి సాగులో సింహభాగాన్ని ఆక్రమిస్తున్న గజ్వేల్‌లో అమ్మకాలు, విత్తు ప్రక్రియ జోరుగా సాగుతోంది.
- కాగా అధిక సాంద్రత పద్ధతిపై రైతులకు అవగాహనలేకనే పాత పద్ధతిని అనుసరిస్తూ నష్టాలపాలవుతున్నారు.
- సంప్రదాయ పద్ధతిలో రెండు విత్తన ప్యాకెట్లతో ఎకరాకు కేవలం 7 నుంచి 8వేల మొక్కలు వస్తుండగా, అధిక సాంద్రత విధానంలో ఎకరాకు 5 ప్యాకెట్ల విత్తనాలతో ఎకరాకు 25వేల మొక్కలు వస్తాయి.
- అధిక దిగుబడి కోసం మొక్కల మధ్య దూరాన్ని తగ్గించే అంశంపై రైతులకు వివరించాల్సిన అవసరం ఉంది.

తొందరపడొద్దు



తొలకరి లేకుండా విత్తనాలు వేసుకోవడం సరికాదు. నేలలో పూర్తి స్థాయి తేమ ఉన్న తర్వాతే విత్తుకోవాలి. లేదంటే విత్తనం ఎదగక రైతు నష్టపోవాల్సి వస్తుంది. విత్తనాలు వేయడంలో రైతులు తొందరపడొద్దు.
– శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

చికిత్స పొందుతున్న ఇద్దరు మృతి

వేర్వేరు ఘటనలో గాయపడిన ఇద్దరు చికిత్స పొందుతూ మృతి చెందారు.

అంతారంగేట్ ఘటనలో...



మల్లేశం(ఫైల్)

కొడిపల్లి(నర్సాపూర్): చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. దీంతో అంతారంగేట్ ఘటనలో మృతి చెందిన వారి సంఖ్య మూడుకు చేరింది. మండలంలోని అంతారంగేట్ సమీపంలో గతనెల 22న అర్ధరాత్రి సమయంలో జాతీయ రహదారిపై ట్రాక్టర్ ట్రక్కును ఓ కారు వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో కంచన్‌పల్లి గ్రామానికి చెందిన దుంపల మల్లేశం(40) తీవ్ర గాయాలు కాగా, అతని భార్య ఆశవర్కర్ స్వరూప(35), కూతురు శ్రీలేఖ(13) అక్కడికక్కడే మృతి చెందారు. బంధువుల అమ్మాయి లావణ్యకు తీవ్ర గాయాలు కాగా కోలుకుంది. కాగా పదహారు రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దుంపల మల్లేశం మంగళవారం మృతి చెందారు. మృతుడు మండలంలోని వెల్మకన్న సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు.

కుటుంబ కలహాలతో..

జహీరాబాద్ టౌన్: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడని జహీరాబాద్ రూరల్ ఎస్ఐ.పరమేశ్వర్ మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జహీరాబాద్ మండలం హోతి(బి) గ్రామానికి చెందిన పాట్‌పల్లి మచ్చేందర్(35) కుటుంబ కలహాలతో మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 5వ తేదీన ఇంట్లో ఎవరూలేని సమయంలో మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే అతడిని జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి, పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి అన్న తుకారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ముగ్గురు కొడుకులపై కేసు నమోదు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామంలో మే 3న ఆత్మహత్య చేసుకున్న వృద్ధుడు మేడబోయిన వెంకటయ్య(90) చావుకు కారణమైన ముగ్గురు కొడుకులపై కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్ చేసినట్లు ఎస్ఐ మహేశ్ తెలిపారు. వెంకటయ్య తన పెద్దకొడుకు దగ్గర ఉండాలని ఉన్నా మిగతా ముగ్గురు కొడుకులు తండ్రి పోషణపై నిర్లక్ష్యం చేయడంతో అతను ఆత్మహత్య చేసుకున్నాడని అందుకు ముగ్గురు కొడుకులపై కేసు నమోదు చేసి చేసినట్ల ఎస్ఐ పేర్కొన్నారు.

అటవీ అధికారులు వేధిస్తున్నారు



నిరసన వ్యక్తం చేస్తున్న తండా వాసులు

గిరిజనుల నిరసన

శివ్వంపేట(నర్సాపూర్): అటవీ శాఖ అధికారులు తమను వేధిస్తున్నారని గిరిజనులు నిరసన వ్యక్తం చేశారు. మండలం పరిధిలోని హరిదాస్ తండాకు అనుకొని ఉన్న అటవీ భూమిని కబ్జా చేశామని, మాపై కేసులు నమోదు చేశారంటూ మంగళవారం వారు నిరసన వ్యక్తం చేశారు. తాతల కాలం నుంచి సర్వే నంబర్ 70లోని 9.35 ఎకరాల భూమిని సాగుచేసుకుంటున్నామన్నారు. అయితే అటవీ భూమిని ఆదివారం అర్ధరాత్రి కొందరు చదును చేశారని, అది మేమే అనుకొని మాపై కేసులు పెట్టారని వాపోయారు. అటవీభూమిని చదును చేసిన వారి పేర్లు చెప్పాలని తమని వేధిస్తున్నారని ఆరోపించారు. తమపై పెట్టిన కేసులు తొలగించాలని డిమాండ్ చేశారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

జూన్ 1న మిస్సింగ్ కేసు నమోదు



సోమ సతీశ్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన భానూర్–బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...పటాన్‌చెరు మండలం చిట్కుల్ పరిధిలోని బాలాజీ హోమ్స్‌లో నివాసం ఉంటున్న సోమ సతీశ్(44) పాశమైలారం పారిశ్రామిక వాడలోని కిర్బీ పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. కాగా తన భర్త మే30వ తేదీన రాత్రి డ్యూటీకని వెళ్లి తిరిగి రాలేదని చెప్పింది. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తుందని శ్రీదేవి పేర్కొన్నారు. దీంతో ఆందోళనకు గురైన భార్య జూన్ 1న బీడీఎల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇది ఇలా ఉండగా మే 31 మధ్యాహ్నమే రామచంద్రపురం మండలం తెల్లాపూర్ శివారులోని రైల్వే ట్రాక్‌పై శరీరం ఛిద్రమైన స్థితిలో రైల్వే పోలీసులకు మృతదేహం లభ్యమైంది. దీంతో వికారాబాద్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతుడి ఆచూకీ లభ్యం కాకపోవడంతో సోమ వారం మృతదేహాన్ని పూడ్చి పెట్టారు. సమాచారం తెలుసుకున్న మృతుడి కుటుంబీకులు రైల్వే పోలీసులను సంప్రదించారు. దీంతో మంగళవారం పోలీసులు మృతదేహాన్ని వెలికి తీయించి కుటుంబీకులకు అప్పచెప్పారు. కాగా పరిశ్రమ యాజమాన్యం వేధింపులతోనే తన భర్త మృతి చెందాడంటూ కుటుంబీకులు, బంధువులతో కలిసి మృతదేహాన్ని తీసుకొని పరిశ్రమ ఎదుట ఆందోళనకు దిగారు. యాజమాన్యం మృతుడి కుటుంబ సభ్యులకు రూ.50 వేలు ఇవ్వడంతో పాటు చట్టపరమైన బెనిఫిట్స్ అందజేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

ఉమ్మడి జిల్లాలో వేర్వేరుచోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందగా, ముగ్గురు గాయపడ్డారు.

ట్రాక్టర్ ఢీకొని బాలుడు..



మధుసూదన్ చౌహాన్ మృతదేహం

జహీరాబాద్ టౌన్: ట్రాక్టర్ ఢీకొని ఓ బాలుడు మృతి చెందాడు. జహీరాబాద్ రూరల్ ఎస్ఐ పరమేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం..ఒంటిలగడ్డ తండాకు చెందిన రాజు చౌహాన్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం రాజు చౌహాన్ భార్య 3 సంవత్సరాల కొడుకు మధుసూదన్ చౌహాన్‌ను వెంటబెట్టుకుని సరుకులు కొనడానికి రోడ్డుపై నుంచి నడుచుకుంటూ వెళ్తుంది. అదే రోడ్డుపై వేగంగా వస్తున్న ట్రాక్టర్ బాలుడిని ఢీకొట్టింది. తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బాలుడి తండ్రి రాజు చౌహాన్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనం పైనుంచి పడి వ్యక్తి...

పటాన్‌చెరు టౌన్: ద్విచక్రవాహనం పైనుంచి కింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులు రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని వడక్‌పల్లికి చెందిన గంగనాళ్ల బిక్షపతి(50) సోమవారం రాత్రి వడకపల్లి నుంచి రామేశ్వరంబండకు ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. మార్గమధ్యలో నాలాపై వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అక్కడికి చేరుకోగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. తీవ్ర గాయాలైన అతడిని స్థానికులు గమనించి పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరు...

కొమురవెల్లి(సిద్దిపేట): ద్విచక్ర వాహనాలు ఢీకొనగా ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని మర్రిముచ్చాలలో చోటు చేసుకుంది. మంగళవారం ఎస్ఐ చంద్రమోహన్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిముచ్చాల గ్రామానికి చెందిన నక్క చంద్రారెడ్డి(76)తన టీవీఎస్‌పై సోమవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో వ్యవసాయ బావి వద్దకు వెళ్తున్న సమయంలో గౌరాయపల్లి నుంచి మర్రిముచ్చాల వైపు వస్తున్న ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తి ఎదురుగా వచ్చి ఢీకొట్టగా చంద్రారెడ్డి మరణించినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు నక్క నర్సిరెడ్డి మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు



గాయపడిన కానిస్టేబుల్ లక్ష్మారెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్): విధులు ముగించుకుని ఇంటికి వస్తున్న ఓ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. మండల పరిధిలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన లక్ష్మారెడ్డి శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి విధులు ముగించుకొని ఇంటికి బైక్ వస్తున్న క్రమంలో మండలంలోని పర్కిబండ గ్రామ శివారులోకి రాగానే బైక్‌ను అడవిపంది ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా కిందపడటంతో, తలకు హెల్మెట్ ఉన్నా తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స కోసం సికింద్రబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉంది.

అడ్వకేట్ కుటుంబానికి గాయాలు



గాయపడిన లలిత



గాయపడిన నందన్

కొండపాక(గజ్వేల్): బైక్ అదుపు తప్పడంతో ఓ అడ్వకేట్ కుటుంబ సభ్యులు గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని తిమ్మారెడ్డిపల్లి శివారు కొమురవెల్లి కమాన్ సమీపంలో రాజీవ్ రహదారిపై చోటు చేసుకుంది. 108 అంబులెన్స్ సిబ్బంది మహేందర్, శ్రీనివాస్ వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లో న్యాయవాద వృత్తి చేస్తున్న దంపతులు లలిత, మోహన్‌బాబు కుమారుడు నందన్‌తో కలిసి స్వగ్రామం జగిత్యాల జిల్లాకు వచ్చారు. మంగళవారం తిరిగి బైక్‌పై హైదరాబాద్ వెళుతుండగా బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలవగా, 108 అంబులెన్స్ సిబ్బంది ప్రథమ చికిత్స అందించి సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మద్యంమత్తులో పురుగుల మందు తాగి...



మచ్చేందర్ (ఫైల్)

జహీరాబాద్: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..హోతి(బి) గ్రామానికి చెందిన పోట్‌పల్లి మచ్చేందర్ కూలిపనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మచ్చేందర్ సోమవారం రాత్రి మద్యం మత్తులో పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మరణించాడు. మృతుడు మూడు నెలల క్రితం కూడా విషం సేవించగా చికిత్స పొంది ప్రాణాపాయం నుంచి బయట పడినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి అన్న తుకారాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గడ్డివాము దగ్ధం



తొగుట(దుబ్బాక): పొలంలో వరికొయ్యలకు నిప్పు పెట్టడంతో మంటలు పక్కన ఉన్న గడ్డివాముపై పడి దగ్ధమైన సంఘటన మండలంలోని ఎల్లారెడ్డిపేట శివారులో మంగళవారం చోటు చేసుకుంది. తుక్కాపూర్‌కు చెందిన రైతు నక్క ఎల్లం వరికోత తీశాక కొయ్యలను కాల్చి వానాకాలం పంట సాగు చేయాలన్న ఉద్దేశంతో నిప్పు పెట్టాడు. మధ్యాహ్నం సమయం కావడంతో ఈదురుగాలులకు మంటలు ఎగిసిపడి పక్కనే ఉన్న గడ్డివాముకు నిప్పంటుకుంది. దీంతో పది ట్రాక్టర్ల గడ్డి పూర్తిగా కాలి బూడిదైంది. దీంతో పశువులకు గడ్డి లేకుండా పోయిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

ధాన్యం కొనుగోలు చేయాలని

రైతుల ఆందోళన



హత్నూర: ఆందోళన చేస్తున్న రైతులు

హత్నూర (సంగారెడ్డి): ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు ఆందోళన చేశారు. బోరుపట్ల కొనుగోలు కేంద్రం వద్ద నెల రోజులు గడిచినా నిర్వాహకులు ధాన్యాన్ని కొనడం లేదు. లారీలు రావడం లేదన్న సాకుతో తూకం వేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో ఇప్పటికే ధాన్యం తడిసి నష్టపోయామన్నారు. దీంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని సకాలంలో కొనకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు స్పష్టం చేశారు. ఇప్పటికైనా వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో రైతులు విట్టల్, చంద్రయ్య, తోట్ల నరసింహులు, గొండ్ల సత్తయ్య, గొండ్ల నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురి ఆత్మహత్య

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ..తండిర మందలించాడని మరొకరు, భర్త పట్టించుకోలేదని ఇంకొకరు వేర్వేరు చోట్ల ఆత్మహత్య చేసుకున్నారు.

పక్కింటి గొడవ విషయంలో భర్త అడగలేదని...



శిరీష (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: పిల్లలు గొడవ పడడంతో పక్కింటి వారు తిట్టారని, ఈ విషయంలో భర్త పట్టించుకోలేదని అతనితో గొడవపడి ఓ భార్య ఆత్మహత్య చేసుకుంది. పటాన్‌చెరు ఎస్ఐ దుర్గయ్య తెలిపిన వివరాల ప్రకారం..రామచంద్రపురంలోని బొంబాయి కాలనీకి చెందిన శిరీష(25) 2019లో పటాన్‌చెరు మండలం ఇంద్రేశానికి చెందిన మన్నే గణేష్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. ఆదివారం సాయంత్రం శిరీష కూతురు పల్లవి పక్కింటి పిల్లలు గొడవపడ్డారు. ఈ విషయంలో పక్కింటివారు ఆమెను తిట్టారని భర్త గణేష్‌కు ఫోన్‌లో చెప్పింది. భర్త ఇంటికి రాగానే పక్కింటి వారిని తిట్టిన విషయంపై అడిగావా అని ప్రశ్నించింది. తనను పక్కింటివారు తిట్టినా, కుటుంబ సభ్యులు తిట్టినా భర్త పట్టించుకోవడంలేదని బాధపడింది. సోమవారం రాత్రి 11గంటల సమయంలో బెడ్‌రూమ్‌లోకి వెళ్లి తలుపులు పెట్టుకుంది. భయానికి గురైన గణేష్ వెంటనే వెళ్లి తలుపులు కొట్టగా ఎంతసేపటికి తీయలేదు. దీంతో అతను తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లి చూశాడు. శిరీష చున్నీతో ఉరివేసుకొని కనిపించింది. చున్నీ విప్పి కిందకు దింపి చూడగా అప్పటికే ఆమె మృతి చెందింది. వెంటనే పోలీసులకు సమాచారం అందజేశాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కూతురు మృతిపై అనుమానం ఉందని తల్లి లక్ష్మిఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో...

గజ్వేల్‌రూరల్: ఆర్థిక ఇబ్బందులతో అప్పుల పాలైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గజ్వేల్ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని తూప్రాన్ రోడ్డు మార్గంలో నివాసముండే కండెల పోశయ్య(48)కు భార్య వెంకటమ్మతో పాటు ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. పోశయ్య పిల్లలందరి పెళ్లిళ్లు చేశాడు. చిట్టీలు వేయడంతో నష్టపోయిన పోశయ్య ఇతరుల వద్ద అప్పులు చేసి ఆర్థికంగా నష్టపోయాడు. దీంతో అప్పులు తీర్చేమార్గం లేక పోవడంతో మనస్థాపానికి గురై సోమవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం మున్సిపాలిటీ పరిధిలోని సంగాపూర్ శివారులో చేగుంట వెళ్లే మార్గంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు పోశయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తండ్రి మందలించాడని...



సాయికుమార్ (ఫైల్)

చేగుంట(తూప్రాన్): తండ్రి మందలించాడని ఓ కొడుకు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్ఐ తావూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం... మాసాయిపేటకు చెందిన తలారి లక్ష్మణ్ కుమారుడు సాయికుమార్(22)ను ఏదైనా పని చేసుకొని డబ్బు సంపాదించాలని మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన సాయికుమార్ మాసాయిపేట శివారులోని రైలు పట్టాలపై కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కామారెడ్డి రైల్వే ఆస్పత్రికి తరలించినట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

మల్లన్నకుంట కబ్జా



కబ్జాకు గురైన మల్లన్నకుంట

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని మల్లంపల్లి, చౌటపల్లి గ్రామ శివారు మల్లన్నకుంట కబ్జాకు గురైంది. 6 ఎకరాల విస్తీర్ణం గల ఈ కుంట వద్ద చెట్లను తొలగించి కుంట కట్టను తొలగించి చదును చేశాడు. రెండు రోజుల కిందట జరిగిన ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చౌటపల్లి గ్రామానికి చెందిన కొంతమంది, భీమదేవరపల్లి మండలం కొత్తకుండకు చెందిన ఓ వ్యక్తి ఈ కుంటను ఆక్రమించినట్లు సమాచారం. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ రమ్యశ్రీని వివరణ కోరగా.. సర్వేనంబర్లు 593, 596, 597 మల్లన్నకుంట ఇరిగేషన్ రికార్డులో ఉందని, కుంట కింద 60 ఎకరాల సాగు నీరు పారకం ఉందని అన్నారు. కుంట కబ్జాకు గురైనట్లు తమ దృష్టికి రాలేదని, విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.